



# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

బుధవారం 3 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3





## రాష్ట్ర సాధన లో ప్రాణాలను అర్పించిన అమర వీరులకు ఘన నివాళులు

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయని అమరవీరుల త్యాగం మరువలేనిదని ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ నాగభూషణ రావు అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాన ఇంజనీర్ కార్యాలయం నందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... నీరే వ్యవసాయానికి జీవనాడి అనే లక్ష్యంతో ఇరిగేషన్ శాఖ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వనరుల పరిరక్షణ ద్వారా రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి చెందేందుకు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అందరం సమష్టిగా



పనిచేద్దామని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర నిర్మాణంలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఇరిగేషన్ శాఖ ద్వారా సాగునీటి రంగ అభివృద్ధికి, నీటి వనరుల సమర్థ వినియోగానికి అంకితభావంతో పనిచేస్తామని పునరుద్ఘాటిస్తున్నాను.



తెలంగాణ ప్రగతి పథంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ యాదగిరి, ఎన్ టి పి ఎ రాజ కుమారి, సీనియర్ అసిస్టెంట్ ఫసియోద్దిన్, ఎఈఈ పాండు, టి ఐ ఎన్ జి ఓ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వాసు ప్రకాశ్, టి ఐ ఎన్ జి ఓ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



-మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది
-జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాభిషేకం.
-తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు

భానుపురి /సూర్యాపేట

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ప్రొఫెసర్ జయ శంకర్ తదితర జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాభిషేకం చేసి ఘన నివాళు లర్పించారు. అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తెలంగాణ సాధనలో అమరవీరులు చేసిన త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని, పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో సూర్యాపేటను మరింత అభివృద్ధి



పథంలో నడిపిస్తామని చెప్పారు. తెలంగాణ జయ జయధ్వానాలు, దేశభక్తి గీతాల నడుమ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సూర్యాపేట లో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

-కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య
ఇల్లందు
మాజీ శాసనసభ్యులు

భానుపురి/సూర్యాపేట టౌన్







రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్న పాలకవర్గ పార్టీలు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనాయని ఇల్లందు మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య ఆవేదన చెందారు. మంగళ వారం సూర్యాపేట పట్టణంలో సి.పి.ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో మునిసిపాలిటీలోని సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యాపేట కొత్త బస్టాండ్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సి.పి.ఐ(ఎం-ఎల్ )మాస్ లైన్ సూర్యపేట జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి శివకుమార్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ గుమ్మడి నర్సయ్య గారు మాట్లాడుతూ 10సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ, రెండున్నర సంవత్సరాల నుండి అధికారంలో ఉంటున్న కాంగ్రెస్ పార్టీ గాని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనాయని ఆయన ఆవేదన చెందారు. ఎన్నో పోరాటాలకు పేరుగాంచిన కోట సూర్యపేట జిల్లాలో సూర్యాపేట పట్టణం సమస్యల వలయంలో ఇరుక్కోవడం బాధాకర విషయమని అన్నారు. ఫార్మా ఫ్యాక్టరీలు వెదజల్లుతున్న విషవాయువులు, సరియైన నిర్మాణంలో లేని డ్రైనేజీ మురుగు నీటి సమస్యతో సూర్యాపేట చుట్టూ పది కిలోమీటర్ల మేర జల కాలుష్యం వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని, తద్వారా విషవాయువులు పీలుస్తున్న ప్రజలు అనేక రకాల శ్వాస చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన అన్నారు. డ్రైనేజీ మురికి నీటిని, రీసైక్లింగ్ కోసం పుల్లారెడ్డి చెరువు ప్రాజెక్టుకు 300 కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించబడినప్పటికీ, ఆ చెరువు నేటికి ఉపయోగంలోకి రాక, పంటలు మొత్తం విష వలయంగా మారి, సూర్యాపేట పట్టణ ప్రజలు విషం తిని బ్రతుకుతున్నారని ఆవేదన చెందారు. జలచరాలు భూచరాలు ఉభయచరాలు మొత్తం కూడా విషంతో నిండిపోయి ఆహారానికి పనికి రాకుండా పోతున్నాయని ఆయన అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీకి నెలకు సుమారు 35 నుండి 40 కోట్ల ఆదాయం వస్తుండగా, ఖర్చులు 25 నుండి 30 కోట్ల వరకు అవుతున్నాయని, ఈ విధంగా నెలకు 10 నుండి 15 కోట్ల ఆదాయం సూర్యాపేట మున్సిపాలిటీకి మిగులుతుండగా సూర్యపేట అభివృద్ధి ఆమెడ దూరంలో ఎందుకు ఉన్నదో అర్థం కావట్లేదని ఆయన ఆవేదన చెందారు. ఇప్పటికైనా పాలకవర్గాలు కళ్ళు తెరిచి, ఆడంబరాలు పక్కకు పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఆయన సూచించారు. లేనియెడల రాబోయే రోజులలో తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్. భద్రయ్య, డాక్టర్ రంగారెడ్డి పాల్గొని సంఘీభావం తెలియజేసి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ కారింగుల వెంకన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి, పిడిఎస్యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ పేర్ల నాగయ్య, పార్టీ జిల్లానాయకులు వాస పల్లయ్య టియుసిఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కామ్రేడ్ గొడ్డలి నర్సయ్య, సయ్యద్ హుస్సేన్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షులు రేణుక, సహాయ కార్యదర్శి సంతోషి మాత, కోశాధికారి జయమ్మ, అంబటి బిక్షం, సైదులు, పావని, లక్ష్మి, పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్.కె గులాం హుస్సేన్, రజాక్, పజూరి రేణుక, పాల్వాయి అనసూయ, కట్ట రమేష్, కల్పన తదితరులు పాల్గొన్నారు.




## స్వరాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమములో పాల్గొన్నందుకు గర్విస్తున్నా

భానుపురి/సూర్యాపేట



దేశ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, అహింసాయుత మార్గంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుందని శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు.తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్న తరుణంలో, మంగళవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమము లో భాగస్వామిని కావడం తనకు ఎంతో గర్వంగా ఉందంటూ ఆయన తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.తెలంగాణ స్వరాష్ట్ర సాధన కొరకు జరుగుతున్న పోరులో ఆంధ్రప్రభ,నమస్తే తెలంగాణ దినపత్రికలో పని చేస్తూ రాత్రి 11 గంటల వరకు ధూమ్ ధామ్, సకల జనుల సమ్మె, జర్నలిస్టుల నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నామని గుర్తు చేశారు.14 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా, శాంతియుతంగా, అహింసా మార్గంలో సాగిన ఉద్యమం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.ఎందరో అమరవీరుల ఆత్మబలిదానాలు, ఉద్యమకారుల పోరాటాలు అన్ని వర్గాల ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం, రాజకీయ జేఏసీ ( జేఏసీ ) తోడ్పాటుతో తెలంగాణ ప్రజల దశాబ్దాల కల 2 జూన్ 2014న సాకారమైందన్నారు.

## జిల్లా ఎస్పీ కార్యాలయం లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం జాతీయ పతాకాన్ని జిల్లా ఎస్పీ నరసింహ సిబ్బందికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వరాష్ట్ర సాధనలో మహానుభావుల త్యాగాలు కృషి గురించి సిబ్బందికి తెలియజేయడం. సిబ్బంది అందరూ స్ఫూర్తితో ప్రజలకు విలువైన పోలీసు సేవలను వేగవంతంగా అందించాలని కోరారు.డిఎస్పీ ప్రసన్న కుమార్, డిసిఆర్బి డిఎస్పీ రవి, అడ్మనిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్ఐ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్ఐ యాకూబ్, జాన్సిరాని, నీలిమ, ఆర్ఎస్ఐ లు సురేష్, సాయి రామ్, అన్వర్, అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు,

## జనగణన--2027 సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



జనగణన--2027 సర్వే దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, ప్రజలందరూ ఎనిమరేటర్లకు సహకరించి తమ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయించుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి జనగణన విజయవంతం కావడానికి తోడ్పడాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న జనగణన--2027 సర్వేలో భాగంగా మంగళవారం అధికారులు జగదీశ్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన సర్వే నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనగణన ద్వారా సేకరించే గణాంకాలు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా సర్వేలో పాల్గొని ఖచ్చితమైన వివరాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య మాట్లాడుతూ పట్టణంలో ఈ నెల 12వ తేదీ నుంచి సర్వే నిర్వహిస్తున్నామని, వచ్చే నెల 9వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. సర్వే కోసం వచ్చే ఎనిమరేటర్లకు ప్రజలు సహకరించాలని, ఎనిమరేటర్లు కూడా ఏ ఒక్క ఇంటిని వదిలిపెట్టకుండా సంపూర్ణంగా సర్వే నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, టీపీబీఓలు, అఖిల్ రెడ్డి, ప్రశాంత్, రెహమాన్, శివాజీ సూపర్వైజర్ గన్నా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ అమరుల ఆకాంక్షలను సాధిద్దాం

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ ఉద్యమ అమరుల ఆకాంక్షల సాధన లక్ష్యంగా ముందుకు సాగుదామని టీజేఏసీ 2009 జిల్లా కోఆర్డినేటర్ ధర్మార్జున్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రం లో మార్కెట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి టి.జెఎసి సూర్యాపేట ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు పూల మాల వేసినివాళులు అర్పించారు. అనంతరం నాడు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమ నాయకులు పలువురు మాట్లాడారు నాటి టి జేఏసీ సూర్యాపేట నియోజకవర్గచైర్మన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ధర్మార్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కోసం అనేక త్యాగాలు చేసి పోరాడిన ఉద్యమకారులను, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రము లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో ప్రభుత్వం నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ సంబరాలకీ ఉద్యమకారులను ఆహ్వానించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఇది విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఉద్యమకారుల పట్ల జిల్లా కలెక్టర్ అధికార యంత్రాంగంనిర్లక్ష్య వైఖరి విడనాడాలని అన్నారు. కేవలం ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన



రాష్ట్రానికి జిల్లాలకు వీళ్ళు నేడు అధికారులుగా ప్రయాసంగా ఉన్నారు అనే విషయాన్ని మర్చిపోవద్దు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ నాయకులు మండారి డేవిడ్ కుమార్, గండూరి రమేష్, , గట్ల రమ శంకర్, తండు నాగరాజు,అనంతుల మధు, తన్నీరు వాసు దేవ్, నవీలే ఉపేందర్, నార బోయిన కిరణ్ బొడ్డు శంకర్ దాచకొండ దేవయ్య వెలుగు వనిత దొండ శ్రీనివాస్. బకరవి ఏనిగా సంతోష్ రెడ్డి,కిరణ్ కుమార్, పిట్టల మురళి, ఫరీద్ ,కొలిక పంగు వాసు, గుద్దేటి మధు సూదన్, గుగులోత్ సురేష్ నాయక్, తగుల్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

-తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

భానుపురి/సూర్యాపేట టౌన్



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావదినోత్సవాన్నిపురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలు చిరస్మరణీయమని, వారి కలల తెలంగాణ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం నింపడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఇరుగు కోటేశ్వరి, వడ్డే శ్యాంసుందర్‌రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరలు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

భానుపురి /సూర్యాపేట



ఇందిరా మహిళా శక్తి చీరలు రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలు స్తున్నాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి తెలిపారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని 11వ వార్డు రాయని గూడెం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కౌన్సిలర్ ఎల్గురి ఇందిరా వీరయ్య ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండోరోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. మహిళల పేరు మీద 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తుందన్నారు. గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే మన ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరిట ఇస్తున్నామని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.వారి ఆర్థిక ప్రగతితో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దే శ్యంతో పథకాలకు సీఎం రేవంత్ రెడ్డి రూపకల్పన చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరీం,వార్డు ఆఫీసర్, ఆర్పీ లు, మాజీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో సూర్యాపేట విద్యార్థుల ప్రతిభ

-అభినందించిన మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

భానుపురి/సూర్యాపేట టౌన్



గత నెల 24 వ తేదీన గోవా రాష్ట్రం నందు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 నందు తెలంగాణ రాష్ట్రం నుండి సూర్యాపేట జిల్లాకు చెందిన స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ సూర్యాపేట జిల్లా సీనియర్ కరాటే మాస్టర్ విజయ్ విద్యార్థులు వివిధ ఏజ్ కేటగిరీలలో, హితక్షి, అక్షయ్, సుహాస్ లకు కటా, కుమితే(ఫైట్) విభాగంలో గోల్డ్, మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు ఈరోజు జిల్లా కేంద్రంలోని క్యాంప్ ఆఫీసు నందు మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి మెడల్స్ సర్టిఫికెట్ అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ ఎంపీ బి ఆర్ ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, కౌన్సిలర్స్ తాహెర్ బిన్ మన్సూర్, గాలి సాయి, మాజీ కౌన్సిలర్ భాష, స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ సూర్యాపేట జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాజీ కౌన్సిలర్ తహర్ పాషా, ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్, మద్ది శ్రీనివాస్ యాదవ్, కక్కిరేణి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సరస్వతి పుత్రుడి సన్మానం

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు రంగా జగన్,సరస్వతి పుత్రుడు రంగా సుచిత్ ఆల్ ఇండియా ఐఐటి 862 ర్యాంక్ సాధించిన సందర్భంగా మంగళ వారం వారి నివాసం లో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసు లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. రంగా సుజిత్ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్య వైశ్య మహాసభ నాయకులు సోమా వెంకటేశ్వర్లు, సోమా ప్రవీణ్ కుమార్, గోపారపు రాజు , గుండా వెంకన్న, బిక్కుమల్ల కృష్ణ, మిట్టపల్లి రమేష్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే. పేరపంగి కోటయ్య చిత్రపటానికి నివాళి

-కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసిన పటేల్ రమేష్ రెడ్డి



భానుపురి/సూర్యాపేట టౌన్

పెన్‌పహాడ్ మండలం నాగులపాడు గ్రామంలో మంగళవారం కీ.శే. పేరపంగి కోటయ్య గారి చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఒగ్గు దేవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోటయ్య గారి సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా భరోసాగా నిలుస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయు

భానుపురి/సూర్యాపేట టౌన్



జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తూ, అర్థ శతాబ్దానికి పైగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే-ఐజేయూ అని, సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదులో టీయూడబ్ల్యుజే ఐజేయు దూసుకుపోతుందని టి యు డబ్ల్యూ జే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వివిధ పత్రికలు, ఛానళ్లకు చెందిన జర్నలిస్టులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలకులు ఎవరైనా జర్నలిస్టుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమేనని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా తరగతులను త్వరలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు, సీనియర్ జర్నలిస్టులు వై. రామ్‌రెడ్డి, కందుకూరి యాదగిరి, గుడిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సభ్యత్వం పొందిన వారిలో విశ్వంభర జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏబీ న్యూస్ ఛానల్ జిల్లా రిపోర్టర్ వల్దాస్ శంకర్, మోతే మండలానికి చెందిన గట్టిగుండ్ల రాము (ప్రజా దర్బార్), ఏర్పుల సాయికృష్ణ (సూర్య), గురజాల వెంకన్న (ప్రజా జ్యోతి), దారంమల్ల ఎలీషా (విజన్ ఆంధ్ర) తదితరులు ఉన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి సామాన్యులను ఆదుకోవాలి

-పెరుగుతున్న ఇంధన ధరలతో ప్రజలపై తీవ్ర భారం పడుతోంది

-సూర్యాపేట బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు చింత నవీన్

భానుపురి/సూర్యాపేట టౌన్

పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలని సూర్యాపేట బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు చింత నవీన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఇంధన ధరల భారం ప్రజల నడ్డి విరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం అన్ని రంగాలపై పడుతోందని, ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంధన ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు అధికమై, దాని ప్రభావం కూరగాయలు, నిత్యావసర సరుకులు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై పడుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న పన్నులను తగ్గించాలని ఆయన కోరారు. పెరుగుతున్న ధరలతో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ధరల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఇంధన ధరలను తగ్గించడం అత్యవసరమని, లేకపోతే సామాన్యులపై మరింత ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని చింత నవీన్ హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన కోరారు.ఈ విలేకరుల సమావేశంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలను విజయవంతం చేయాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

వచ్చే నాలుగు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభల కోసం మండలాల వారీగా ఎంపిడిఓలు, తహసీల్దార్లు పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లాలో నిర్వహించే గ్రామ సభలు, శానిటేషన్, తాగునీరు, సీజనల్ వ్యాధుల నివారణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల సవరణలపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందితో పాటు, మండల స్థాయి అధికారులు కూడా ఖచ్చితంగా గ్రామ సభల్లో పాల్గొనేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు వేదికల్లో నిర్వహించాలని, గ్రామ సభలు అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. రైతులకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించాలని తెలిపారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అదే విధంగా జిల్లాలో యూరియా విక్రయాలు ఎక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు యూరియాను ఎందుకు అంత ఎక్కువగా వినియోగిస్తున్నారనే అంశంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆలోచన చేయాలన్నారు. అలాగే, వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలు గట్టి నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. అదే విధంగా రానున్న వర్షాకాలం పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒకవేళ వర్షపాతం తక్కువగా నమోదైతే ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం నిర్వహించబోయే వన మహోత్సవం కార్యక్రమం కోసం అటవీ శాఖ, డీఆర్డీఏ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ తక్షణమే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో డ్రైనేజీల క్లీనింగ్, పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలి. వారం రోజుల్లోగా సమగ్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో కలుషిత నీటి సమస్య రాకుండా, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల న్నారు. ప్రజాపాలన కార్యక్రమాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను అధికారులు సబ్మిట్ చేస్తే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అలాగే, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) పై అధికారులందరికీ పూర్తి అవగాహన ఉండాలని, ఇందుకోసం సిబ్బందికి తక్షణమే ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ప్రగతిలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

**గ్రామ సభల విజయవంతానికి పోలీస్ శాఖ పూర్తి సహకారం: జిల్లా ఎస్పీ కె. నరసింహ**




జిల్లాలో నిర్వహించబోయే గ్రామ సభలు, వార్డు సభలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పోలీస్ శాఖ నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సభల పర్యవేక్షణ, బందోబస్తు నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక పోలీస్ అధికారిని (స్పెషల్ ఆఫీసర్) నియమిస్తున్నట్లు చెప్పారు. అలాగే, మున్సిపాలిటీలలో నిర్వహించే వార్డు స్థాయి సభలలో కూడా పోలీస్ సిబ్బంది ఖచ్చితంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గ్రామ సభలను వేదికగా చేసుకుని శాంతిభద్రతలతో పాటు పలు కీలక సామాజిక అంశాలపై ప్రజలకు పోలీస్ శాఖ తరపున అవగాహన కల్పించనున్నట్లు ఎస్పీ వివరించారు. ముఖ్యంగా స్త్రీ, శిశు సంరక్షణ, మహిళలు, బాలల భద్రత, చట్టాలపై అవగాహన, యాంటీ డ్రగ్స్, అలైవ్ అరైవ్ నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులను ముంచే నకిలీ విత్తన విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తోందని ఎస్పీ నరసింహ తెలిపారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజు నుంచే విద్యార్థులకు, యువతకు యాంటీ డ్రగ్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా పక్కా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డీజీపీ సి.వి. ఆనంద్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ , జిల్లా ఎస్పీ కె నరసింహ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యక్రమం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.జూన్ 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం అమలులో ఉన్న పర్యావరణ కార్యక్రమాలకు అదనంగా ఈ సభలను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.గ్రామ, వార్డు సభలలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిని కూడా గ్రామ సభలలో చర్చించాలని తెలిపారు.నాలుగు రోజుల వ్యవధిలో జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు.






భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పై కొంత వ్యతిరేక ప్రచారం జరుగుతోందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.గ్రామ సభలలో పంటల మార్పిడి విధానం పై వ్యవసాయ శాఖ విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎరువుల బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువుల నిల్వలు, డీలర్ల గోదాములపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి జిల్లాకు విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ఇందుకోసం విడుదల చేసిన నిధుల వినియోగ ధ్రువపత్రాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య మాట్లాడుతూ,లి రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మురుగు కాల్వల శుభ్రత, తాగునీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకం కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణంపై గ్రామసభలలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రణాళికలను కూడా గ్రామసభల్లో వివరించాలని సూచించారు.వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 21 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి కందులు, జొన్నలు, ఉలవలు, మొక్కజొన్న, శనగలు, మినుములు, పెసర్లు, ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, గ్రామసభలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో పోలీసు శాఖ అధికారులు అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలపై గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నప్పటికీ, కురిసే వర్షాలు భారీ స్థాయిలో ఉండవచ్చని, వరదలు తదితర విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లాలు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జూన్ 4,6,8,10 తేదీలలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సభల, పట్టణ ప్రాంతాలలో వార్డు సభలను విజయ వంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష

భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష. ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడి రాష్ట్రాన్ని సాధించారు. అందుకే ప్రజలు ఆయన్ను జాతిపితగా పిలుస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి చెందిన తీరును ప్రజలు మర్చిపోరు. 24 గంటల విద్యుత్, ధాన్యం, పాలు, చేపలు, మాంసం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే. కాంగ్రెస్ మాయమాటలకు మోసపోయి ప్రజలు గోసపడుతున్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదు. కేసీఆర్ పథకాలు దూరమయ్యాయి. మరోసారి ఉద్యమ చైతన్యంతో



పోరాడి, బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చి కేసీఆర్, కేటీఆర్ సారథ్యంలో తెలంగాణకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ నెమ్మది బిక్షం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమకారులకు ఘన సన్మానం

భానుపురి/యాదాద్రి భువనగిరి

జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఎర్ర జాన్సన్, పూల నాగయ్య, తమ్మిడి పద్మారావు, మొగుళ్ళ దేశాయి రెడ్డి, ఆడెపు బాలస్వామి,మందుల విజయలను తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కందడి మణిపాల్ రెడ్డి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఫ్రెండ్స్ క్లబ్ లోజరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపంతో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు మలిదశ ఉద్యమకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కందడి మనిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1997 నుండి అనేక కష్ట, నష్టాలను ఓర్చి ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించి ఇలాంటి ఫలాలను పొందని ఉద్యమ నాయకులను గుర్తించి ఘనంగా సన్మానించాలనే కవితక్క పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు రాజకీయాలకు అతీతంగా నిజాయితీగల ఉద్యమ నాయకులను గుర్తించండంలో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ నిజమైన నిజాయితీగల ఉద్యమకారులను గుర్తించి స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి పింఛన్, హెల్త్ కార్డు, 250 గజాల ప్లాటు ఇచ్చి గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు.